

రంజాన్ వేళలు: ఇఫ్తార్ (బుధ) సా.6.25 | సహరి (గురు) ఉ.4.41

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు బాలికలు ఆత్మహత్య
- 7లో



ఉత్తుత్తి బటన్

సీఎం జగన్ బటన్‌లు నొక్కినా సొమ్ములు పడలేదు
ఆర్భాటంగా బటన్ నొక్కి సొమ్ములు బ్యాంకు ఖాతాలకు జమచేసినట్లు కలరింగ్
బ్యాంకులు చుట్టూ లబ్ధిదారుల ప్రదక్షిణలు
జగనన్న చేయూత, ఈబీసీ నేస్తం, వడ్డీరాయితీ, పంట నష్టపరిహారం సొమ్ములది అదే పరిస్థితి
వైఎస్ఆర్ ఆసరా సొమ్ములు అరకొరగానే
జగనన్న విద్యాదీవెనది అదే దారి
అసలు డబ్బులు వస్తాయో లేదో అంటూ సందేహాలు

పిఠాపురం, మార్చి 26:



దేశంలో ఎక్కడా లేని పథకాలు అమలు చేస్తున్నాం, నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ములు జమచేస్తున్నాం అంటూ జగన్ చెప్పే ఆర్భాటపు మాటలు అన్ని ఇన్నీ కావు. బటన్ నొక్కుతున్నా, నేరుగా మీ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడుతున్నాయంటూ ఇచ్చే కలరింగ్ ఒక రేంజ్‌లో ఉంటుంది. వాస్తవంలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నం. ఇటీవల కాలంలో బటన్ పథకాలకు సొమ్ములు పడక లబ్ధిదారులు మాత్రం రోజుల తరబడి బ్యాంకులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ రావడంతో అసలు సొమ్ములు వస్తాయా రావా అన్న సందేహాలు నెలకొన్నాయి. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు వస్తున్న తరుణంలో గత నెలరోజుల్లో వివిధ పథకాలకు సంబంధించి సొమ్ములు విడుదలకు సీఎం జగన్ బటన్‌లు నొక్కడంలో తీరిక లేకుండా గడిపారు. దీనికి భారీ స్థాయిలో బహిరంగ సభలు నిర్వహించి ప్రభుత్వ సొమ్ముతో జనాలు తరలించి సొంత డబ్బా కొట్టుకున్నారు. జనవరి నుంచి ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే వరకూ పది వరకూ పథకాలకు బటన్‌లు నొక్కినా లబ్ధిదారుల ఖాతాలకు మాత్రం నగదు చేరలేదు.

విద్యా దీవెన విడతలుగా..

వృత్తి విద్యా కోర్సులు, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన ద్వారా ప్రభుత్వం ఫీజుల సొమ్మును వాయిదా రూపంలో వారి తల్లుల ఖాతాలకు జమచేసే విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ ఏడాది మొదటి విడతగా మార్చి 1వ తేదీన జిల్లాలోని 41,474 మంది విద్యార్థులకు సంబంధించి 37,196 మంది తల్లుల ఖాతాలకు రూ.28.84 కోట్లను సీఎం జగన్ బటన్ నొక్కి విడుదల చేశారు. ఈ సొమ్ములు తల్లుల ఖాతాలకు చేరకుండానే ఎక్కడికక్కడ విద్యాసంస్థలు ఫీజులు చెల్లించాలని ఒత్తిడి తెస్తుండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

రైతులకు మొండి చేయి

సార్వా, రబీ సమయాల్లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు అదే సీజన్ ముగిసేలోగా పంట నష్టపరిహారం (ఇన్‌పుట్ సబ్సిడీ) అందిస్తామని, గతంలో ఇలా ఎవ్వరు చేయలేదని అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జగన్ గొప్పలు చెబుతూ వచ్చారు. డిసెంబరులో వచ్చిన మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో సార్వా పంటను రైతులు తీవ్రంగా నష్టపోయారు. వారందరికి సీజన్ ముగిసే లోగా సంక్రాంతికి ముందుగానే పరిహారం అందిస్తామని ప్రకటించారు. రెండు నెలలు ఆలస్యంగా మార్చి 6వ తేదీన జిల్లాలో 13,540 హెక్టార్లల్లో వ్యవసాయ, ఉద్యానవన పంటలు నష్టపోయిన 29,370మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.23.05 కోట్లు జగన్ బటన్ నొక్కి విడుదల చేశారు. 20 రోజులు గడిచినా ఒక్క రైతుకు ఇంత వరకూ పంట నష్టపరిహారం మాత్రం రాలేదు. రైతులు తమకు పరిహారం రాలేదంటూ వ్యవసాయాధికారులను ప్రశ్నిస్తున్నారు.

చేయూత ఎక్కడ?

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన 45-60 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన మహిళలకు ఏటా రూ.18,500 అందించే వైఎస్ఆర్ చేయూత నిధుల విడుదల కార్యక్రమాన్ని మార్చి 7వ తేదీన నిర్వహించారు. సీఎం జగన్ బటన్ నొక్కి నిధులు విడుదల చేశారు. ఎన్నికల పుణ్యమా అని నిధులు ముందే వస్తున్నాయని ఆశించిన మహిళలకు నిరాశే మిగిలింది. జిల్లాలో 1,01,759 మంది మహిళలకు రూ.190.80 కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించారు. ఇప్పటి వరకూ మహిళల ఖాతాలకు మాత్రం నిధులు రాలేదు.

ఈబీసీ నేస్తందీ అదే దారి

ఈబీసీ నేస్తం ద్వారా అగ్రవర్ణాల పేదలకు ఏటా రూ.15 వేలు అందించే ఈబీసీ నేస్తం నిధులను సీఎం జగన్ మార్చి 14వ తేదీన బటన్ నొక్కి నిధులు విడుదల చేశారు. జిల్లాలో 9,516 మంది మహిళల ఖాతాలకు రూ.14.27 కోట్లు జమ చేస్తామని ప్రకటించారు. అయితే ఇప్పటి వరకూ ఖాతాలకు సొమ్ములు పడలేదు.

2 నెలలు దాటినా ఆసరా ఏదీ?



మహిళాశక్తి (పొదుపు) సంఘాలు 2019 ఏప్రిల్ నాటికి తీసుకున్న రుణ మొత్తాలను మాఫీ చేస్తామని చెప్పిన జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని నాలుగు విడతల్లో తీరుస్తామంటూ ప్రకటించారు. అందులో భాగంగా నాలుగో విడతగా నిధులను జనవరి 23వ తేదీన జగన్ విడుదల చేశారు. కాకినాడ జిల్లాలో 37,525 గ్రూపుల్లోని 3,76,071 మంది మహిళలకు రూ.300.74 కోట్లు నిధులు విడుదల చేశామని, ఇవి ఆయా లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలకు జమవుతాయని ప్రకటించారు. మండలాలు, గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో వార్డుల వారీగా సమావేశాలు పెట్టి మహిళలను తరలించి వైసీపీ నేతలు ప్రచారాలు చేసుకున్నారు నమూనా చెక్కులు అందించారు. ఇప్పటివరకూ 50 శాతం లబ్ధిదారులకు కూడా సొమ్ములు అందలేదు. ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా మాత్రమే నిధులు రావడంతో ఆయా వర్గాలకు చెందిన వారికే సొమ్ములు పడినట్లు చెబుతున్నారు. మిగిలిన వారికి రెండు నెలలు దాటుతున్నా ఇంకా ఖాతాలకు సొమ్ములు జమ కాలేదు.



వడ్డీ రాయితీ ఎక్కడ

లక్ష లోపు వ్యవసాయ స్వల్పకాలిక పంట రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో రుణాన్ని వడ్డీతో సహా తిరిగి బ్యాంకులు, సహకారం సంఘాలకు చెల్లిస్తే వడ్డీ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. దీని కింద కాకినాడ జిల్లాలో 34,270 మంది రైతులకు వడ్డీ రాయితీగా రూ.5.35 కోట్లను సీఎం జగన్ ఫిబ్రవరి 28న బటన్ నొక్కి విడుదల చేశారు. ఇప్పటికే వడ్డీ రాయితీ విడుదల అయిదు నెలలు ఆలస్యం అయింది. అయినప్పటికీ బటన్ నొక్కి నాలుగు వారాలు కావస్తున్నా ఒక్కరికి సొమ్ములు అందలేదు.

ప్రతిపక్షాలపై నెపం నెట్టేందుకేనా?

ఎన్నికల ప్రవర్తనా నియమావళి వచ్చిన తర్వాత ప్రభుత్వ పథకాలకు సంబంధించిన లబ్ధి అందించడంలో కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరించాల్సి ఉంటుంది. షెడ్యూల్ ప్రకటించే వరకూ బటన్‌లు నొక్కుతూ సొమ్ములు విడుదల చేశామని ప్రకటించుకున్న జగన్ వాటిని లబ్ధిదారుల ఖాతాలకు మాత్రం జమచేయలేదు. ప్రభుత్వం వద్ద నిధులు అందుబాటులో లేకపోవడం, తీసుకున్న రుణాలు, ఇతర మొత్తాలను అయిన వారికి బిల్లులు చెల్లించడంపైనే దృష్టి పెట్టి పథకాలకు మాత్రం నిధులు విడుదల చేయకపోవడంలో కుట్ర దాగి ఉందని ప్రతిపక్ష నేతలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల తేదీ సమీపించిన తర్వాత నిధులను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమచేయాలని జగన్ భావిస్తున్నారని, తద్వారా ఓటర్లను ప్రలోభ పెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని వారు చెబుతున్నారు. ప్రతిపక్షాలు అభ్యంతరం చెబితే వారిపై నెపం నెట్టి నిధులు విడుదల బాధ్యత నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారని తెలిపారు. జగన్‌లో చిత్తశుద్ధి ఉంటే బటన్‌లు నొక్కిన వాటికి ఇప్పటికే నిధులు ఇచ్చేవారిన వారంటున్నారు.

ఆర్భాటం కోసమే ఇదంతా..

ఎన్నికలు సమీపిస్తున్న వేళ జనవరి నుంచి ఏదొక పథకం కింద నిధులు విడుదలకు బటన్ నొక్కుతున్నట్లు జగన్ చెప్పడం, సొంత మీడియాలో భారీ ప్రకటనలు ఇచ్చి ప్రచారం చేసుకోవడం మినహా లబ్ధిదారులకు మాత్రం సొమ్ములు చేరకపోవడం విస్మయాన్ని కలిగిస్తున్నది. రెండు నెలల క్రితం బటన్ నొక్కిన వైఎస్ఆర్ ఆసరా డబ్బులు మహిళా సంఘాల సభ్యుల ఖాతాలకు జమ కాకపోవడం చూస్తుంటే ప్రచారం మీద దృష్టి తప్ప వారికి మేలు చేయాలన్నది కాదని తెలుస్తున్నదని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఎన్నికల ముందు పథకాల పేరుతో ప్రజలను మభ్య పెట్టేందుకే ఇలా చేస్తున్నారని మండిపడుతున్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ కృతికాశుక్లా

తాగునీటి సమస్య పరిష్కారానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక

● కలెక్టర్ కృతికాశుక్లా

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 26: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె గ్రామీణ నీటి సరఫరా, మునిసిపల్, పంచాయతీ, ఇరిగేషన్, వ్యవసాయం, కాలుష్యం, పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో ఎట్టి పరిస్థితిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే సీపీడబ్ల్యూఎస్, పీడబ్ల్యూఎస్ పథకాలకు సంబంధించి 22 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ ఏప్రిల్ 10వ తేదీకి పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. కాలువలు మూసివేసే ముందు చెరువులను వంద శాతం నింపేందుకు ఇరిగేషన్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. మంచినీటి సరఫరా పథకాలకు తక్షణమే విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయాలన్నారు. బోర్‌వెల్స్, బోర్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలన్నారు. పరిశ్రమల వ్యర్థ పదార్థాలు కాలువలోకి విడుదల కాకుండా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికలు రూపొందించాలన్నారు. అరట్లకట్ల చెరువుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో శ్రీరామ చంద్రమూర్తి, గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎం.శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ వెంకటరావు, వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్, డీపీవో భారతి సౌజన్య ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే అనుమతులు

● ఇప్పటివరకు 95 దరఖాస్తుల పరిష్కారం ● కలెక్టర్ కృతికాశుక్లా



కలెక్టరేట్(కాకినాడ), మార్చి 26: సార్వత్రిక ఎన్నికల్లో వచ్చే దరఖాస్తులకు తక్షణమే అను మతులు ఇస్తున్నామని, ఇప్పటివరకు 95 దరఖాస్తులకు అనుమతులిచ్చామని జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన వెలువరించారు. జిల్లాలో వివిధ అనుమతులు కోరుతూ మొత్తం 161 దరఖాస్తులు రాగా 95 మంజూరు చేశామన్నారు. అలాగే 23 దరఖాస్తులను తిరస్కరించగా, 24 ప్రోగ్రెస్‌లో ఉండగా మరో 19 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయన్నారు. జిల్లాలో రూ.56.95 లక్షల విలువైన సరుకు సీజ్ చేశామన్నారు. దీనిలో రూ.33 వేల నగదు, రూ.44.16 లక్షల విలువైన మద్యం, ఇతరు సరుకు సీజ్ చేశామన్నారు. పోలీస్ శాఖ ద్వారా రూ.5.95 లక్షల స్టేట్ గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ ఇతర టాక్స్‌ల ద్వారా రూ.50 లక్షల రూపాయలు సీజ్ చేశామన్నారు. జిల్లాలో సీ విజిల్ యాప్ ద్వారా 140 ఫిర్యాదులు వచ్చాయన్నారు. దీనిలో 85 ఫిర్యాదులు డ్రాప్ చేశామన్నారు. ఎక్సైజ్ ఎస్ఈబీ ద్వారా 357 లీటర్ల అక్రమ మద్యాన్ని సీజ్ చేశామన్నారు. జిల్లాలో 324 ఆయుధాలకు అనుమతి ఉండగా 265 ఆయుధాలు డిపాజిట్ చేశామన్నారు. 59 ఆయుధాలకు ఎసెన్షియల్ సర్వీస్ కింద మినహాయింపు ఇచ్చామన్నారు. జిల్లాలో 8 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు.

సేవలు బంద్

ఎన్నికల వేళ ప్రభుత్వ కార్యాలయాల్లో మందగించిన సేవలు
పెండింగ్‌లో పలు దరఖాస్తులు
ఆఫీసుల చుట్టూ జనం ప్రదక్షిణలు

సామర్లకోట, మార్చి 26: రెవెన్యూ కార్యాలయాల్లో పౌర సేవలు మందగించాయి. పదిహేను రోజుల నుంచి కనీస సేవలు కూడా తహశీల్దార్ కార్యాలయాల్లో అందని పరిస్థితి. సాధారణ పౌర సేవలతో పాటు ఎన్నికల నిర్వహణ ప్రక్రియలోనూ రెవెన్యూ కార్యాలయాలు కీలకం కాగా ఏ ఆఫీసుకు ప్రజలు వెళ్లి తమ పనులు అడిగినా తాము ఎన్నికల పనిలో ఉన్నామని సమాధానం వస్తోంది. జిల్లాలో ప్రజలకు అసలే అంతంతమాత్రంగా అందుతున్న రెవెన్యూ సేవలు ప్రస్తుతం పూర్తిగా బంద్ అయ్యాయి. ఎన్నికల పనులు పేరుతో అత్యధిక రెవెన్యూ కార్యాలయాల్లో రెవెన్యూ అధికారులు, సిబ్బంది సాధారణ పౌర సేవలను ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ప్రత్యేకించి మండల రెవెన్యూ కార్యాలయాలు, సచివాలయాలలో వీఆర్వోలు ఎక్కడా కానరావడం లేదు. ఏ ధ్రువీకరణ పత్రంకైనా ప్రాథమిక సంతకం కావాలంటే ముందుగా వీఆర్వో సంతకం కావాల్సిందే. అయితే గత నెల రోజులుగా వీఆర్వోలు ఎక్కడా కానరావడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఎన్నికల విధులంటూ తప్పించుకుంటూ వారివారి వ్యక్తిగత పనులలో నిమగ్నం అవుతున్నారన్న ఆరోపణలు అనేకం ఉన్నాయి. కొన్నిచోట్ల కొత్తగా వచ్చిన రెవెన్యూ అధికారులు కనీసం తమ పేరుతో డిజిటల్ సిగ్నేచర్ కీ(డీఎస్‌కే)లు కూడా తీసుకున్న పరిస్థితి లేదు. దీంతో వివిధ వర్గాల ప్రజలు రెవెన్యూ సేవలు అందక తీవ్ర ఇక్కట్లుకు గురవుతున్నారు.

తహసీల్దార్ల బదిలీలతో

ఎన్నికల నేపథ్యంలో తహశీల్దార్ల బదిలీలతో మ్యూటేషన్, అడంగల్, పట్టాదారు పాసుపుస్తకం తదితర పాత దరఖాస్తులకు అసలు కదలికలే లేకపోయాయని పలువురు దరఖాస్తుదారులు వాపోతున్నారు.

పురోహితుల ఆగ్రహం

పిఠాపురం, మార్చి 26: కాకినాడలోని శివాలయంలో అర్చకులపై దాడికి పాల్పడిన వైసీపీ నాయకుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బ్రాహ్మణ సేవాపరిషత్, ఉమా కుక్కుటేశ్వర పురోహిత సంఘం ఆధ్వర్యంలో పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సేవా పరిషత్ అధ్యక్షుడు యనమండ్ర సూర్యనారాయణ మాట్లాడుతూ వైసీపీ పాలనలో బ్రాహ్మణులకు రక్షణ కరువైందని విమర్శించారు. విధులు నిర్వర్తిస్తున్న అర్చకులపై వైసీపీ నాయకుడు, మాజీ కార్పొరేటర్ దాడికి పాల్పడటం హేయమైన చర్యగా అభివర్ణించారు. ఆలయాల్లో పని చేసే అర్చకులకు రక్షణ లేకుండా వారు ఎలా పూజా కైంకర్యాలు నిర్వహిస్తారని ప్రశ్నించారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని, లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆందోళనలో విశ్రాంత ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం, బ్రాహ్మణ సేవా పరిషత్ సభ్యులు, అర్చకులు, పురోహిత సంఘం సభ్యులు పాల్గొన్నారు.



పిఠాపురంలో ఆందోళన నిర్వహిస్తున్న పురోహిత సంఘాలు

చిన్న వివాదమే: బాధిత అర్చకులు

పోర్టుసిటీ (కాకినాడ), కార్పొరేషన్: వైసీపీ నాయకుడు సిరియాల చంద్రరావు తమపై జరిపిన దాడిని భక్తుడికి, పూజారికి మధ్య జరిగిన చిన్న వివాదమని అర్చకులు చెప్పారు. దాడి విషయమై మంగళవారం సాయంత్రం దేవస్థానం ప్రాంగణంలో విలేకర్లతో మాట్లాడారు. ఇకపై సమస్యను అధికారులే చూసుకుంటారని తెలిపారు. ఎమ్మెల్యే ద్వారంపూడి ఆదేశాలతో ఓ వైసీపీ యువ మాజీ కార్పొరేటర్ సమస్యను అన్ని విధాల ఒత్తిళ్లను ప్రయోగించి రాజీ చేసినట్టు తెలిసింది. విలేకర్ల సమావేశం నిర్వహిస్తున్న సమయంలో సదరు మాజీ కార్పొరేటర్ అక్కడే ఉండడం గమనార్హం. అర్చకులను ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం సాయంత్రం పరామర్శించారు. కాకినాడ పెద్ద శివాలయంలో అర్చకులను మాజీ కార్పొరేటర్ కొట్టడం తప్పేనని తెలిపారు. మంగళవారం శివాలయం వద్ద బాధిత అర్చకులను పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బాధితుడికి అన్ని విధాలుగా అండగా ఉంటామని చెప్పారు. రాజకీయం చేయొద్దని కోరారు.

దాడి హేయమైన చర్య

వైసీపీ ప్రభుత్వం హయాంలో అర్చకులపై దాడులు పెరిగాయని, కాకినాడలో జరిగిన దాడి దాడి హేయమైన చర్య అని టీడీపీ బ్రహ్మణ సాధికారిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.బుచ్చిరాంప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడికి గురైన వెంకటసత్యసాయి, కార్తీక శర్మలను పరామర్శించి ధైర్యం చెప్పారు. దేవుడి సేవలోను ఉండే అర్చకులపై వైసీపీ గుండాలు రాష్ట్రవ్యాప్తంగా దాడులు చేస్తున్నారని, మొత్తం 39 ప్రాంతాల్లో ఈ విధమైన దాడులు జరిగాయిని చెప్పారు.

అర్చకులకు పరామర్శ

పోర్టుసిటీ (కాకినాడ), మార్చి 26: కాకినాడ బాలాత్రిపురసుందరి సమేత భీమేశ్వరస్వామి దేవస్థానంలో వైసీపీ నాయకుడి చేతిలో దాడికి గురైన అర్చకులను పలువురు పరామర్శించారు. మంగళవారం దేవదాయ,ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ ఎమ్.విజయరాజు బాలాత్రిపురసుందరి సమేత భీమేశ్వరస్వామి దేవస్థానంలో అర్చకుల ను పరామర్శించి దాడి ఘటనపై ఆరా తీశారు. దేవస్థానం ఈవో ఆర్.రాజేశ్వరరావు నుంచి వివరాలు సేకరించారు. న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు..

ఎస్పీ సతీష్‌కుమార్‌కు డీజీపీ గోల్డ్ డిస్క్ అవార్డు



కాకినాడ క్రైం, మార్చి 26: విధి నిర్వహణలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ ప్రతిష్ఠాత్మకమైన డీజీపీ గోల్డ్ డిస్క్ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. సతీష్ కుమార్ 2016 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. ఆయన తొలుత అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీగా పని చేస్తూ గతేడాది కాకినాడ జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన అందించిన సేవలకు గాను గతంలో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి నుంచి డీజీపీ సిల్వర్ డిస్క్ అవార్డును అందుకున్నారు. సతీష్‌కుమార్ ప్రస్తుతం కాకినాడ జిల్లా ఎస్పీగా పనిచేస్తూ అక్రమ మద్యం, విచ్చలవిడి మద్యపానంపై ఉక్కుపాదం మోపారు. అలాగే జిల్లాలో నూతన సంస్కరణలు తీసుకువచ్చారు. ఈనేపథ్యంలో ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర హోం శాఖ ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ అవార్డును త్వరలో డీజీపీ నుంచి అందుకోనున్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శులుగా ముదునూరి, వాసిరెడ్డి

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు
- 7లో

కొత్తగా కొంగొత్తగా..

సార్వత్రిక ఎన్నికలకు నూతన విధానాలు

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా జవహర్



కొవ్వూరు, మార్చి 26: టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శామ్యూల్ జవహర్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు అధిష్ఠానం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జవహర్ నివాసం వద్ద పార్టీ కార్యకర్తలు, అభిమానులు సంబరాలు జరిపారు. జవహర్ మాట్లాడుతూ పార్టీ బాధ్యతలు అప్పగించినందుకు టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్, నందమూరి బాలకృష్ణ, రాష్ట్రాధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయుడిగా ఉన్న జవహర్‌ను గుర్తించి 2014లో టీడీపీ కొవ్వూరు నుంచి నిలబెట్టిన సంగతి తెలిసిందే. అపుడు గెలిచి మంత్రి కూడా అయ్యారు. ఎన్నికల ముందు ఆయన సేవలు ఉపయోగించుకోవాలని అధిష్ఠానం భావించినట్టుంది. ఆయనకు ఏకంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పదవిని కట్టబెట్టింది.

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా రెడ్డి సుబ్రహ్మణ్యం



కొత్తపేట, మార్చి 26: టీడీపీ పొలిట్‌బ్యూ రో సభ్యుడిగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటకు చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకుడు రెడ్డి సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. రెడ్డి సుబ్రహ్మణ్యం గతంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా చేశారు. ప్రస్తుతం రామచంద్రపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా వున్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యా నికి పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ముదునూరి



ప్రత్తిపాడు, మార్చి 26: టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ప్రత్తిపాడు మండలం ధర్మవరంనకు చెందిన ముదునూరి మురళీకృష్ణంరాజు నియమితులయ్యారు. మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెంనాయుడు ఆదేశాలు జారీ చేశారు. అమలాపురం నియోజకవర్గ పార్టీ పరిశీలకుడిగా ఉన్న మురళీకృష్ణంరాజును తాజాగా రాష్ట్ర పార్టీ కార్యదర్శిగా నియమించడం పట్ల నియోజకవర్గంలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. మురళీరాజుకు పదవి రావడంపై జిల్లాలోని పలువురు టీడీపీ నాయకులు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపి అభినందనలు తెలిపారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా వాసిరెడ్డి ఏసుదాసు



సర్పవరం జంక్షన్, మార్చి 26: తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శిగా కాకినాడరూరల్ మాజీ ఎంపీపీ వాసిరెడ్డి ఏసుదాసును నియమిస్తూ ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరపు అచ్చెన్నాయుడు మంగళవారం విడుదలచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తనకు పదవి అప్పగించిన చంద్రబాబు, అచ్చెన్నాయుడుతో పాటూ ఇతర నాయకులకు ఏసుదాసు కృతజ్ఞతలు తెలిపారు. పంతం నానాజీ విజయంతోపాటూ జిల్లాలో అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానన్నారు. టీడీపీ నాయకులు ఏసుదాసును అభినందించారు.

రాజమహేంద్రవరంలో విజిలెన్స్ సోదాలు

రాజమహేంద్రవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని టి.నగర్‌లో ఉన్న లక్ష్మీ గణేశ్ మిల్క్ డెయిరీలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆదేశాలతో సిబ్బంది సోదాలు చేశారు. ఒక వెన్న, రెండు నెయ్యి నమూనాలను సేకరించి ల్యాబ్‌కి పంపించారు. ధ్రువీకరణ లేని తక్కెడ, 5కిలోల పెరుగు బకెట్లపై వినియోగదారుల సంరక్షణ వివరాలు లేకపోవడం, వాణిజ్య అవసరాలకు గృహవినియోగ సిలిండర్లు వాడుతుండడం గుర్తించి కేసులు నమోదు చేశారు. సోదాల్లో డీఎస్పీ ముత్యాలు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా... కొంగొత్తగా

● సార్వత్రిక ఎన్నికలకు నూతన పద్ధతులు

పెద్దాపురం, మార్చి 26 : కొత్తగా..కొంగొత్తగా 2024 సార్వత్రిక ఎన్నికలకు నూతన పద్ధతుల్ని కేంద్ర ఎన్నికల సంఘం ఆచరణలోకి తీసుకురాబోతోంది. పోలింగ్ శాతాన్ని గణనీయంగా పెంచడంతోపాటు యువ ఓటర్లందరూ ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రోత్స హించడం, ఎన్నికల సందర్భంగా జరిగే అక్రమాలను నిలువరించేందుకు పటిష్టచర్యలు తీసుకుంటోంది. తొలిసారి 85 ఏళ్లపైబడి మంచం కదల్లేని వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించనున్నారు.

యూత్ పోలింగ్ కేంద్రం..

యువ ఓటర్లు ఎక్కువమంది ఉన్న ప్రాంతాలను గుర్తించి యు వకుల కోసమే ప్రత్యేకంగా నియోజకవర్గానికి ఒకటిచొప్పున పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేయనున్నారు. ఈకేంద్రంలో పోలింగ్ విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది కూడా యువకులే ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. యువఓటర్లను పోలింగ్ కేంద్రాల వైపు నడిపించే లా వారిని ఆకర్షించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో మహిళలు, దివ్యాంగుల ఓటింగ్ శాతం పెంచేందుకు వారి కోసమే ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఈసారి యువ ఓటర్లపై ఈసీ గురిపెట్టింది.

ఇంటివద్దే ఓటుహక్కు...

2019 సార్వత్రిక ఎన్నికల్లో సాధారణ ఓటర్లు అందరూ పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటుహక్కు వినియోగించుకుంటున్నారు. ఈసారి 85 ఏళ్ల పైబడి మంచంపై నుంచి కదల్లేని స్థితిలో ఉన్నవారు, దివ్యాంగు లకు ఇంటివద్దే ఓటుహక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఫారం 16డీ ద్వారా కల్పించనున్నారు. హోమ్ ఓటింగ్ కోసం దరఖాస్తు చేసుకుంటే ఎన్నికల అధికారులు పరిశీలించి అవకాశం ఇవ్వను న్నారు.

పోలింగ్ కేంద్రం ఎక్కడో తెలుసుకోవచ్చు..

గత ఎన్నికల్లో జిల్లాలో 80శాతం పోలింగ్ నమోదైంది. ఈసారి 95శాతానికి పైబడి నమోదయ్యేలా ప్రణాళికలు రూపకల్పన చేస్తున్నారు. ఓటర్లకు తమ ఓటు ఎక్కడుందో తెలియకపోవడం, కుటుంబ సభ్యుల ఓట్లు వేర్వేరు చోట్ల ఉండడంతో చాలామంది ఇబ్బంది పడుతున్నారని ఎన్నికల సంఘం గుర్తించింది. ఈనేప థ్యంలో ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈయాప్‌ను ఫోన్‌లో నిక్షిప్తం చేసుకుని ఓటరు ఎపిక్ కార్డు నంబరు నమోదుచేస్తే ఏ పోలింగ్ కేంద్రంలో ఓటువేసే అవకాశం ఉందనే వివరాల్ని ఇట్టే తెలిసిపోతాయి. ఫోన్ అనుసంధానిత ఐచ్ఛికాన్ని దీనికి ప్రత్యేకంగా ఇచ్చారు.



ప్రతి పైసాకు లెక్క.

ఎన్నికల్లో అభ్యర్థుల వ్యయానికి సంబంధించి ప్రతీ పైసాకు ఈసారి లెక్క ఉండబోతోంది. తొలిసారి నియోజకవర్గానికి ఒక అకౌం టింగ్ బృందాన్ని ఏర్పాటుచేశారు. గతంలో జరిగిన ఎన్నికల్లో అభ్యర్థులు తాము చేసిన వ్యయానికి సంబంధించిన వివరాలన్నీ ఎన్నికల వ్యయ పరిశీలకులకు 15 రోజులకు ఒకసారి సమర్పించాల్సి ఉండేది. ప్రస్తుతం ప్రచారంతోపాటు ఇతరత్రా కార్యక్రమాలకు చేస్తు న్న వ్యయాన్ని పరోక్షంగా అకౌంటింగ్ బృందాలు పరిశీలించనున్నాయి.

పలు రైళ్లు రద్దు, పలు రైళ్లు దారి మళ్లింపు

సామర్లకోట, మార్చి 26: విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో నిర్వహిస్తున్న ట్రాక్ పనుల దృష్ట్యా ఏప్రిల్ 1 నుంచి 28 వరకూ విజయవాడ-విశాఖల మధ్య సామర్లకోట మీదుగా రాకపోకలు సాగించే పలు రైళ్లను తాత్కాలికంగా రద్దు చేసినట్లు, మరికొన్ని రైళ్లను దారి మళ్లించినట్లు రైల్వే పీఆర్వో నస్రత్ మండ్రూప్‌కర్ మంగళవారంరాత్రి సామర్లకోట రైల్వేస్టేషన్ ఉన్నతాధికారికి లేఖ పంపారు. ఈ మేరకు ఆ సమాచారాన్ని ఆంధ్రజ్యోతి సేకరించింది. 22701 నంబరు గల గుంటూరు-విశాఖల మధ్య, 22702నంబరు గల విశాఖ-గుంటూరుల మధ్య, 17219 నంబరు గల మచిలీపట్నం-విశాఖల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్‌లను ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 28 వరకూ రద్దు చేశారు. 17220 నంబరు గల విశాఖ-మచిలీపట్నంల మధ్య నడిచే రైలు ఏప్రిల్ 2 నుంచి ఏప్రిల్ 29 వరకూ రద్దు చేశారు.

మరికొన్ని రైళ్ల దారి మళ్లింపు

13351 నంబరు గల ధన్‌బాద్-అలప్పుజ మధ్య రాకపోకలు సాగించే బొకారో ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 1 నుంచి 28వరకూ నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడ చేరుతుంది. 12835 నంబరు గల హతియా-బెంగుళూరుల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 2, 7, 9, 14, 16, 21, 23, 28 తేదీలలో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడ చేరుతుంది. 18637 నంబరు గల హతియా-బెంగుళూరుల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 6, 13, 20, 27 తేదీలలో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. 22837 నంబరు గల హటియా-ఎర్నాకుళంల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 1, 8, 15, 22 తేదీలలో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. 18111 నంబరు గల టాటా-యశ్వంత్‌పూర్‌ల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 4, 11, 18, 25 తేదీలలో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. 12376 నంబరు గల జాసిడ్-తాంబరమ్‌ల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 3, 10, 17, 24 తేదీలలో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. 12509 నంబరు గల బెంగుళూరు-గౌహతిల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 3, 5, 10, 12, 17, 19, 24, 26 తేదీలలో విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్‌ల మీదుగా నిడదవోలు చేరుతుంది. 11019 నంబరు ముంబాయి-భువనేశ్వర్‌ల మధ్య రాకపోకలు సాగించే కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 1, 3, 5, 6, 8, 10, 12, 13, 15, 17, 19, 20, 22, 24, 26, 27 తేదీలలో విజయవాడ,గుడివాడ, భీమవరం టౌన్‌ల మీదుగా నిడదవోలు చేరుతుంది. 12889 నంబరు గల టాటా-ఎస్ఎంవీ బెంగుళూరుల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 5, 12, 19, 26 తేదీలలో నిడదవోలు, భీమవరం, గుడివాడల మీదుగా విజయవాడకు చేరుతుంది. 22643 నంబరు గల ఎర్నాకుళం-పాట్నాల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 12, 8, 15, 22 తేదీలలో విజయవాడ, గుడివాడ, భీమవరంల మీదుగా నిడదవోలు చేరుతుంది. 12756 నంబరు గల భావనగర్-కాకినాడ పోర్టుల మధ్య రాకపోకలు సాగించే ఎక్స్‌ప్రెస్ రైలు ఏప్రిల్ 6, 13, 20, 27 తేదీలలో విజయవాడ, గుడివాడ, భీమవరంల మీదుగా నిడదవోలు చేరుతుంది. మరిన్ని వివరాలకు సమీపంలో గల రైల్వే స్టేషన్ బుకింగ్ కార్యాలయ సిబ్బంది ద్వారా సమాచారాన్ని తెలుసుకోవచ్చని రైల్వే పీఆర్వో నస్రత్ మండ్రూప్‌కర్ తెలిపారు.

జనసేన నాయకుడికి ఎస్ఐకి మధ్య వివాదం

● పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత

ముమ్మిడివరం, మార్చి 26: భూ తగాదా విషయంలో పోలీసుస్టేషన్‌కు వెళ్లిన జనసేన నాయకుడి పట్ల ఎస్ఐ దౌర్జన్యంగా ప్రవర్తించిన తీరుపై ముమ్మిడివరంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. భూ తగాదా విషయంలో లంకాఫ్ ఠాణేలంక గ్రామానికి చెందిన ఇరువర్గాల వారిని ఎస్ఐ బి.సురేష్‌బాబు మంగళవారం పోలీసుస్టేషన్‌కు పిలిపించి ఇరువర్గాలకు చెందినవారిని కూర్చోబెట్టారు. జనసేన పార్టీ నాయకుడు గోదశి పుండరీష్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఆ భూ వివాదం గురించి మాట్లాడుతుండగా ఎస్ఐ ఏకవచనంతో మాట్లాడి దురుసుగా ప్రవర్తించడంతో పుండరీష్‌కు, ఎస్ఐకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. విషయం బయటికి రావడంతో జనసేన, టీడీపీ నాయకులు, ఓ సామాజికవర్గానికి చెందిన యువత పోలీసుస్టేషన్‌కు తరలివచ్చి ఆందోళనకు దిగారు. ఎస్ఐకు వ్యతిరేకంగా నినాదాలుచేసి ఎస్ఐ దౌర్జన్యం నశించాలని రోడ్డుపై బైఠాయించారు. దీంతో సీఐ ఎన్.కొండయ్య అక్కడకు చేరుకుని బాధితుడు పుండరీష్‌ను ఎస్ఐ సురేష్‌బాబును, నాయకులతో మాట్లాడి జరిగిన విషయంపై సుదీర్ఘ చర్చలు జరిపారు. స్టేషన్ ఎదుట పెద్దఎత్తున ఆందోళనకారులు గుమిగూడి పరిస్థితి ఉద్రిక్తతకు దారితీయడంతో వారందరికీ సీఐ నచ్చజెప్పి బుధవారం మరోసారి చర్చించి వాస్తవాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటామని సీఐ వారికి హామీఇచ్చి పంపించి వేశారు. నాయకులు తాడి నరసింహారావు, చెల్లి అశోక్, దాట్ల పృథ్విరాజ్, గుద్దటి జమి, దేశంశెట్టి గోపి, తోలేటి రాంబాబు, పోలిశెట్టి బాబి, నూకల దుర్గలతోపాటు పలువురు చర్చలు జరిపిన వారిలో ఉన్నారు. పుండరీష్ ఎవరో తెలి యక అలా మాట్లాడానని ఎస్ఐ సురేష్‌బాబు సంజాయిషీ ఇచ్చినప్పటికీ పుండరీష్ సంతృప్తి చెందలేదు.



ముమ్మిడివరంలో రాస్తారోకో చేస్తున్న యువకులు

ఇద్దరు ఇంటి దొంగల సస్పెన్షన్

● టేకు చెట్ల గల్లంతు బాగోతంలో ప్రాథమిక చర్యలు

● మరికొందరిపై చర్యలకు రంగం సిద్ధం

● డివిజన్‌స్థాయి నుంచి బీట్ స్థాయి వరకు జల్లెడపట్టే పనిలో దర్యాప్తు బృందాలు

రంపచోడవరం, మార్చి 26: రంపచోడవరం అటవీశాఖ డివిజన్ పరిధిలో రంపచోడవరం, మారేడుమిల్లి రేంజ్‌ల పరిధిలో టేక్ ప్లాంటేషన్లలో 400కు పైగా టేకు చెట్లను నరికేసిన అక్రమ బాగోతంలో ఒక డిప్యూటీ రేంజ్ అధికారిని, మరొక ఫారెస్ట్ బీట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేస్తూ అటవీశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ వ్యవహారంలో ఈ పై ఇద్దరి పాత్ర ఆధారాలతో రుజువు కావడంతో వారిపై తక్షణ చర్యలు తీసుకున్నారు. ఇదే భాగోతంలో మరి కొందరిపై చర్యలు తీసుకునేందుకు వీలుగా సమగ్ర దర్యాప్తును రాజమహేంద్రవరంలోని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ పర్యవేక్షణలో ఆరు బృందాలను నియమించించిన సంగతి తెలిసిందే. అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి డివిజన్‌స్థాయి నుంచి బీట్ స్థాయి వరకు అందరి అధికారులు తమ సిబ్బంది సెల్‌ఫోన్లను కూడా జల్లెడపట్టే పనిలో దర్యాప్తు బృందాలు నిమగ్నమయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతి



మృతిచెందిన ఉపాధ్యాయుడు సాంబయ్య

కూనవరం,మార్చి26: రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు మృతిచెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం అల్లూరి జిల్లా కూనవరం మండలం నరసింగపేటగ్రామానికి చెందిన సోయం సాంబయ్య టేకుబాక గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. భీమవరం గ్రామంలో పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో నరసింగపేట-పొట్టాయిగూడెం మధ్యలోసాంబయ్య, అతని స్నేహితుడు ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి టాటా వ్యాన్ ఢీకొంది. దీంతో తీవ్రగాయాలైన సాంబయ్య, స్నేహితుడు రాజును ప్రభుత్వాస్పత్రికి తరలించగా సాంబయ్య మృతి చెందాడు. రాజును మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ శిశువిహార్‌కు మగశిశువు



సర్పవరంజంక్షన్, మార్చి 26: కాకినాడ జీజీహెచ్‌లో 10 రోజుల చికిత్స అనంతరం ఆరోగ్యంగా కోలుకున్న మగ శిశువును అశోక్‌నగర్‌లో గల శిశువిహార్ సెంటర్‌లో ఉంచినట్లు ఐసీడీఎస్ పీడీ కె. ప్రవీణ ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 13వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో తెల్లటి గుడ్డలో చుట్టిన మగశిశువును బోట్‌క్లబ్ ప్రవేశద్వారం వద్ద వదిలేసి ఉండటం, శిశువు ఏడుపు విన్న స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి 108 సాయంతో జీజీహెచ్‌లో ఎస్ఐసీయూలో ఉంచిన వైద్యులు శిశువుకు వైద్య చికిత్సలు అందించారు. సర్పవరం పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశామన్నారు. చిన్నారి ఆరోగ్యసంరక్ష కోసం శిశువిహార్‌లో ఉంచామని, ఈ బాబు కోసం సంబంధిత తల్లిదండ్రులు, రక్త సంబంధీకులు 30 రోజుల్లో తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని కోరారు. ఎవరూ రాని పక్షంలో చట్టబద్ధంగా బాబును దత్తత ఇస్తామన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారికి జైలు

రాజమహేంద్రవరం, మార్చి 26(ఆంధ్రజ్యోతి): అధిక సొమ్ము రాబడి ఉంటుందని ఆశజూపి మోసం చేసిన కేసులో ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుడికి కోర్టు జైలు శిక్ష విధించింది. టూటౌన్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లజర్ల మండలం ప్రకాశరావుపాలెంనకు చెందిన కాకర్ల శ్రీనివాసచౌదరి... కోమలి రియల్ ఎస్టేట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పేరుతో రియల్ ఎస్టేటు వ్యాపారం చేస్తుంటాడు. రాజమహేంద్రవరం టి.నగర్‌లో ఓ కార్యాలయం తెరిచాడు. తణుకులో వెంచర్లు వేశామని పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని పలువురిని నమ్మించాడు. రూ.10 వేలు కడితే రోజుకు రూ.300 చొప్పున 300రోజుల్లో మూడు రెట్లు అధికంగా పొందవచ్చని ఆశజూపాడు. వలలో పడిన కొందరికి రశీదులు కూడా ఇచ్చాడు. అయితే తర్వాత ముఖం చాటేశాడు. దీంతో 35 మంది బాధితులు పోలీసులను ఆశ్రయించారు. నేరం రుజువు కావడంతో శ్రీనివాసరావుకు మూడేళ్ల జైలు, రూ.5వేల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్సు జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్ తీర్పు చెప్పారు. నేరస్తుడికి త్వరితగతిన శిక్ష పడడంలో చొరవచూపిన డీఎస్పీ అంబికాప్రసాద్, సీఐ శ్రీనివాస రావు, పీపీ ఎంఏ బాషా, హెచ్‌సీ సీహెచ్ శ్రీనివాసరావును ఎస్పీ జగదీశ్ అభినందించారు.

శ్రీరామజన్మభూమి మినియేచర్ పత్రం విడుదల

అమలాపురం టౌన్, మార్చి 26: అయోధ్యలో ప్రారంభించిన శ్రీరామ జన్మభూమి ఆలయంపై భారత తపాలా శాఖ ఆరు తపాలా బిళ్లలతో కూడిన మినియేచర్ పత్రాన్ని విడుదల చేసింది. తపాలా బిళ్లల ముఖ విలువ ఒక్కొక్కటీ రూ.5 కాగా మినియేచర్ పత్రానికి రూ.100గా నిర్ధారించారు. ఈమినియేచర్ పత్రాన్ని అమలాపురం భూపయ్య అగ్రహారానికి చెందిన తపాలా బిళ్లల సేకరణకర్త పుత్సా కృష్ణకామేశ్వర్ సేకరించారు.



పది పరీక్షకు వెళుతుండగా తండ్రి మరణవార్త

● పుట్టెడు దుఃఖంలో పరీక్ష రాసిన టెన్త్ విద్యార్థి





తండ్రి మృతదేహం వద్ద విలపిస్తున్న చరణ్

రాజవొమ్మంగి మార్చి 26: అల్లూరి జిల్లా రాజవొమ్మంగి మండలంలోని తంటికొండ గ్రామానికి చెందిన పరిశిక చరణ్ ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు రాస్తున్నాడు. ఇంటి నుంచి రాజవొమ్మంగిలోని పరీక్షా కేంద్రానికి వచ్చిన చరణ్‌కు తన తండ్రి చనిపోయాడనే విషయం తెలిసింది. అందరూ ఇంటికి వెళ్లిపొమ్మన్నారు. తండ్రి మరణంతో దుఃఖంలో ఉన్న చరణ్ పరీక్ష రాసే వెళ్తానని చెప్పి, పరీక్ష త్వరగా రాసి ఇంటికి వెళ్లి తన తండ్రి భౌతికకాయానికి అంత్యక్రియలు నిర్వహించాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం చరణ్ తండ్రి బాలరాజు జీడిమామిడి తోటకు వెళ్లి తీవ్ర అస్వస్థతకు గురై పడిపోవడంతో గ్రామస్థులు ఇంటికి తీసుకుని వచ్చారు. మంగళవారం ఉదయం పదో తరగతి పరీక్ష రాసేందుకు చరణ్ రాజవొమ్మంగి వచ్చే సరికి పలువురి ద్వారా తన తండ్రి మరణవార్త తెలుసుకున్నాడు. దుఃఖాన్ని దిగమింగుకొని పరీక్ష రాశాడు. పరీక్ష అనంతరం తన సోదరుడు హర్షవర్దన్‌తో కలిసి అంత్యక్రియలు నిర్వహించాడు.



హుండీలలో కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

అన్నవరం సత్యదేవుడి హుండీల ఆదాయం రూ. 1.01 కోట్లు

అన్నవరం, మార్చి 26: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధికి విచ్చేసిన భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించగా రూ.1,01,55,528 నగదు, 12 గ్రాముల బంగారం, 522 గ్రాముల వెండి లభించింది. వీటితోపాటుగా యూఎస్ఏకు చెందిన 41 డాలర్లు, సింగపూర్ 12, మలేషియా 11 డాలర్లు సమకూరాయి. లెక్కింపును ఈవో రామచంద్ర మోహన్, చైర్మన్ రోహిత్, డిప్యూటీ కమిషనర్ రమేష్‌బాబు తదితరులు పర్యవేక్షించగా సిబ్బంది, వ్రతపురోహితులు, నాయీబ్రాహ్మణులు లెక్కింపులో పాల్గొన్నారు. 20 రోజులకు ఈ ఆదాయం లభించగా రోజుకు స్వామి వారి హుండీలలో రూ. 5.07 లక్షలను భక్తులు సమర్పించుకున్నారు.

అంతర్వేది స్వామివారి ఆదాయం రూ.16,49,294



అంతర్వేదిలో స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

అంతర్వేది, మార్చి 26: బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 29 రోజులకుగాను స్వామివారి హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. ప్రధాన ఆలయం, గుర్రాలక్కమ్మ అమ్మవారి హుండీ ద్వారా రూ.16,12,175, అన్నదాన హుండీ ద్వారా రూ.37,119, మొత్తం హుండీల ఆదాయం రూ.16,49,294 వచ్చింది. అలాగే స్వామివారి అనుబంధ ఆలయమైన నీలకంఠేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.15,491 వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఏసీ నాగమల్లేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

భావనారాయణస్వామి హుండీ ఆదాయం రూ.5.63లక్షలు

సర్పవరం జంక్షన్, మార్చి 26: మాఘమాసంలో సర్పవరంలో శ్రీరాజ్యలక్ష్మి సమేత శ్రీభావనారాయణస్వామికి భక్తులు వివిధ కానుకల రూపంలో శ్రీవారి హుండీలో వేసిన నగదును లెక్కించగా రూ.5,63,490లు ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో జొన్నాడ భీమశంకరరావు తెలిపారు. మంగళవారం సర్పవరంలో శ్రీభావనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో దేవాదాయ,ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఫణీంద్ర ఆధ్వర్యంలో స్వామివారి హుండీలో వేసిన నగదును భక్తుల సమక్షంలో లెక్కించారు. మాఘమాసం నెల రోజులపాటు నిర్వహించిన మాఘమాస తిరునాళ్లకు శ్రీభావనారాయణ స్వామిని దర్శించుకున్న భక్తులద్వారా ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

మనస్తాపంతో బాలిక ఆత్మహత్య

కాకినాడ రూరల్, మార్చి 26: కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తూరంగి మహాలక్ష్మీనగర్‌కు చెందిన ఓ బాలిక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం జరిగి ంది. ఇంద్రపాలెం ఎస్ఐ మణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మహత్య చేసుకున్న బాలిక తరచూ వేరే యువకుడితో ఫోన్‌లో మాట్లాడేదని అది తెలుసుకున్న తల్లిదండ్రులు ఆమెను మందలించగా మనస్తాపానికి గురైన బాలిక వారి ఇంటి పైఅంతస్తులోని గదిలోగల సీలింగ్ ఫ్యాన్‌కు సోమవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా వెంటనే వైద్యం నిమిత్తం తల్లిదండ్రులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం చనిపోయిందన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గడ్డి మందు తాగి బాలిక మృతి

కొత్తపల్లి, మార్చి26: మాట వినడంలేదని తల్లి మందలించిన సంఘటనలో బాలిక గడ్డి మందు తాగి మృతి చెందిందని మంగళవారం కొత్తపల్లి పోలీసులు తెలిపారు. కాకినాడజిల్లా కొత్తపల్లి మండలం కొండెవరం గ్రామానికి చెందిన బండి మణి చంద్రికను ఆమె తల్లి ఇంటివద్ద మాట వినకుండా ఏపనిచేయడంలేదని ఈనెల 19న మందలించింది. దీంతో మనస్తాపం చెందిన బాలిక గడ్డి మందు తాగి అపస్మారకస్థితికి చేరింది. ఈ విషయాన్ని గుర్తించిన తల్లిదండ్రులు తొలుత పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర వైద్యం అవసరం కావడంతో వెంటనే కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం బాలిక మృతి చెందిందని పోలీసులు తెలిపారు.

దేవరపల్లి పాఠశాలలో స్వల్ప అగ్నిప్రమాదం

● వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు.. అదుపు చేసిన సిబ్బంది

దేవరపల్లి, మార్చి 26: దేవరపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నభోజనం చేసే సందర్భంలో స్వల్ప అగ్నిప్రమాదం సంభవించిందని ఎంఈవో తిరుమలదాసు తెలిపారు. పాఠశాలలో మంగళవారం ఉదయం వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయన్నారు. వెంటనే హెల్పర్స్ గమనించి ఉపాధ్యాయుల సాయంతో ఫైర్ ఎక్స్టింగ్ మిషన్ ద్వారా మంటలను అదుపు చేశారన్నారు. అయితే సదరు మిషన్ ద్వారా వచ్చిన వాయువు వల్ల ఆహార పదార్థాలు తినడానికి పనికి రాకుండా పోయాయని, నిల్వ ఉంచిన నిత్యావసర సరుకులు కూడా పాడయ్యాయన్నారు. ఈ విషయాన్ని పైఅధికారులకు తెలియజేస్తామన్నారు. కాగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ప్రత్యామ్నయ పద్ధతిలో అందించామన్నారు. ఈ సంఘటన వల్ల రూ.10 వేల వరకు నష్టం జరిగినట్టు తెలిపారు.

గోదావరిలో మునిగి యువకుడి మృతి



గోదావరిలో మునిగి మృతిచెందిన శివశంకర్ మృతదేహంవద్ద రోధిస్తున్న బంధువులు

సీతానగరం, మార్చి 26: గోదావరిలో మునిగి యువకుడు మృతి చెందిన విషాద సంఘటన ముగ్గళ్ల గ్రామంలో జరిగింది. పశ్చిమగోదావరిజిల్లా పోలవరం గ్రామానికి చెందిన గోపల శివశంకర్ కుటుంబం రఘుదేవపురంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చి ఉంటోంది. మంగళవారం ఉదయం శివశంకర్ (21) తన స్నేహితులతో కలసి ముగ్గళ్లలోని గోదావరిలో స్నానానికి వెళ్లాడు. స్నేహితులు ముగ్గురు ఒడ్డున స్నానం చేస్తుండగా శివ శంకర్ కొంతమేర లోపలికి వెళ్లగా మునిగిపోయాడు. స్నేహితులు రక్షించే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. సమాచారం అందుకున్న ఏఎస్ఐ సమర్పణరావు, సిబ్బంది సంఘనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టగా సాయంత్రం సుమారు 5గం.లకు మృతదేహం లభ్యమైంది. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసు పత్రికి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు సమర్పణరావు తెలిపారు. ఈఘటనతో రఘుదేవపురంలో విషాదఛాయలు అలుముకున్నాయి. చేతికి అందివచ్చిన కుమా రుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విల పిస్తున్నా రు. గోదావరిలో నిబంధనలు అతిక్రమించి లోతుగా ఇసుక తవ్వకాలు జరిగాయని, ఆ గోతులవల్ల మునిగిపోయినట్టు తెలుస్తోంది.

వేసవి శిక్షణ శిబిరాల ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానం

కాకినాడ అర్బన్, మార్చి 26: జిల్లాలో మే 1 నుంచి 31 వరకు ఆయా ప్రాంతాల్లో వివిధ క్రీడల్లో వేసవి శిక్షణ శిబిరాల ఏర్పాటుకు దరఖాస్తులు కోరుతున్నట్లు డీఎస్‌ఏ సీఈవో బి.శ్రీనివాసకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వివిధ అసోసియేషన్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు వివరాలతో ఏప్రిల్ 2లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి

అదనపు కమిషనర్ నాగనరసింహారావు



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 26: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడుతున్నందున పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కమిషనర్ సీహెచ్.నాగనరసింహారావు ఆదేశించారు. స్మార్ట్‌సిటీ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు, ఆర్‌ఐలు, సచివాలయ అడ్మిన్లతో మంగళవారం సాయంత్రం పన్నుల వసూళ్లపై సమీక్షించారు. బకాయిలపై వడ్డీ రాయితీ ఈనెల 31తో ముగియనుందని పన్ను చెల్లింపుదారుల నుంచి బకాయిలు వసూలు అయ్యేలా చొరవ తీసుకోవాలన్నారు. ఇంటి పన్నులతో పాటు కుళాయి పన్నులపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. రూ.7 కోట్ల ఆస్తి పన్ను, రూ.5 కోట్లు కుళాయి పన్నులు వసూలు కావాల్సి ఉందన్నారు. నూరుశాతం వసూలు చేసేలా సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, రెవెన్యూ అధికారులు చెక్కా రమణ, నిర్మల, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

సాగరతీరంలో టైగర్ ట్రంప్ విన్యాసాలు

బీచ్‌రోడ్డులో వాహనాల రాకపోకల నిలుపుదల



వాహనాల రాకపోకల నిలుపుదలకు ఏర్పాటు చేసిన బోర్డులు

సర్పవరం జంక్షన్, మార్చి 26: దేశ రక్షణ, భారత భూభాగం దురాక్రమణకు పాల్పడుతున్న ఉగ్రవాదుల నిర్మూలన, శత్రు దేశాలతో యుద్ధసమయంలో భారత్, అమెరికా త్రివిధ దళాలు సంయుక్తంగా ఈనెల 26 నుంచి 31వరకు నిర్వహించనున్న టైగర్ ట్రంప్ విన్యాసాల కోసం కాకినాడ బీచ్‌రోడ్డుపై వాహనాల రాకపోకలను పోలీసులు నిలుపుదల చేశారు. మంగళవారం ఉప్పాడ నుంచి కాకినాడ వైపు బీచ్‌రోడ్డును వెళ్లే వాహనాలను కాకినాడ డీఎస్పీ హనుమంతరావు ఆదేశాల మేరకు రూరల్ సర్కిల్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు నిషేధించారు. వాహనాల రాకపోకలను నియంత్రించే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి బందోబస్తు నిర్వహించారు. ఇప్పటికే విశాఖ నుంచి విన్యాసాల్లో పాల్గొనేందుకు ఆర్మీ వాహనాల్లో సిబ్బంది, ట్రూప్‌లు నావెల్ ఎన్‌క్లేవ్‌కు చేరుకుని సన్నాహాలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఈనెల 28న నుంచి జరిగే రెండు దేశాల విన్యాసాల్లో పాల్గొనేందుకు యుద్ధట్యాంకర్లు, యుద్ధ నౌకలు బుధవారం రానున్నాయి. ఇప్పటికే విశాఖ తీరంలో టైగర్ ట్రంప్ విన్యాసాలు నిర్వహిస్తున్నారు.

'కూటమి అభ్యర్థుల విజయానికి కృషి'

సామర్లకోట, మార్చి 26: కాకినాడ జిల్లాలో గత ఏడేళ్లుగా నా ఫౌండేషన్ ద్వారా పలు సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించాను. రాజకీయాల్లో పోటీ చేసే అవకాశం కోసం ఎదురుచూశాను. అదృష్టం నన్ను వరించలేదు. అయినా నిరుత్సాహం చెందకుండా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి నా వంతు కృషి చేస్తానని సానా సతీష్‌బాబు ఫౌండేషన్ అధ్యక్షుడు సానా సతీష్‌బాబు వెల్లడించారు. అచ్చంపేటలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ, జనసేన పార్టీల తరఫున ఎన్నికల్లో పోటీచేసేందుకు సీటు వస్తుందని ఆశించానన్నారు. తాను సమాజసేవలు చేయడంలో ఎంతో తృప్తి చెందానని, రానున్న కాలంలో మరింత విస్తృతం చేస్తామన్నారు. టీడీపీ, జనసేనలోని అందరు నాయకులూ తనకు సన్నిహితులేనని కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానని తెలిపారు.

గుణ్ణం చంద్రమౌళితో టీడీపీ జోన్-2 ఇన్‌చార్జి భేటీ



జోన్-2 ఇన్‌చారితో గుణ్ణం చంద్రమౌళి

సామర్లకోట, మార్చి 26: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుణ్ణం చంద్రమౌళితో పార్టీ జోన్-2 ఇన్‌చార్జి, పరిశీలకుడు, మాజీ మంత్రి సుజయకృష్ణ రంగారావు మంగళవారం సాయంత్రం భేటీ అయ్యారు. కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీ కూటమి అభ్యర్థులు గెలుపొందేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై వారు సుదీర్ఘంగా సమీక్షించారు. కాకినాడలో వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడిపై పైచేయి సాధించే అంశంపై చర్చించారు. తునిలో మంత్రి దాడిశెట్టి రాజాను ఓడించే విషయంలో అక్కడ టీడీపీలో మరింత వేగం పెర గాల్సి ఉందన్న విషయమై చర్చించారు. జిల్లాలో ఎక్కువ సీట్లు నెగ్గించుకొచ్చే విషయంలో పార్టీ ఆదేశాలు అమలు చేస్తామని కృష్ణరంగారావుకు చంద్రమౌళి హామీ ఇచ్చారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ చైర్మన్‌గా సూర్యప్రకాశరావు

ప్రత్తిపాడు మార్చి 26: మండలం పోతులూరు గ్రామానికి చెందిన మొయ్యేటి సూర్యప్రకాశరావు కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ ఛైర్మన్‌గా రెండోసారి నియమితులయ్యారు. మంగళవారం నియామక ఆదేశాలను జిల్లా పార్టీ అధ్యక్షుడు పాండురంగారావు సూర్యప్రకాశరావుకు అందజేశారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశరావు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, కేంద్ర మాజీ మంత్రి ఎంఎం.పళ్లంరాజు, పార్టీ పెద్దల కొప్పులరాజు, గిడుగు రుద్రరాజు, కె.వినయ్‌కుమార్, ఎం.శ్రీరామచంద్రమూర్తి, చిలుకూరి పాండురంగారావు, సుంకర పద్మశ్రీల సహకారంతో తనకు ఈ పదవి లభించిందన్నారు. పార్టీ పురోభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మహిళా కార్యదర్శిగా నియోజకవర్గంలోని యర్రవరంకు చెందిన ఏనుగుపల్లి కుమారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారిద్దరినీ పార్టీ నాయకులు నీరుకొండ సత్యనారాయణ, కొల్లు వీరగణేష్ అభినందించారు.

'ఆదిత్య' విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

గండేపల్లి, మార్చి 26: సూరంపాలెంలో ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ విభాగం విద్యార్థులు పారిశ్రామిక సందర్శనలో భాగంగా విశాఖపట్నం రుషికొండ, మధురువాడలో గల పెన్నంట్ టెక్నాలజీను సందర్శించారు. పెన్నంట్ టెక్నాలజీస్ సంస్థ పనితీరు విధి విధానాలను పరిశీలించారు. విభాగాధిపతి డాక్టర్ ఎం.అనిల్‌కుమార్ పారిశ్రామిక సందర్శనలు విద్యార్థుల్లో ప్రత్యక్ష పరిజ్ఞానం పొందడానికి దోహదపడతాయన్నారు.

సూరంపాలెం ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం నందు ఇండస్ట్రీ ఇండుస్ట్ సాఫ్ట్ స్కిల్స్ ఫర్ టెకిసీ అనే అలుమ్ని ఇంటరాక్షన్ విజయవంతంగా నిర్వహించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆదిత్య పూర్వ విద్యార్థి హాజియాలి షేక్ సాఫ్ట్ స్కిల్స్ ఇనిసియేటివ్, టీంవర్క్, ఎథిక్స్ ప్రాధాన్యతను వివరించారు. డీన్ డాక్టర్ జి.సురేష్, డీన్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, ఈసీఈ విభాగం అధిపతి డాక్టర్ ఎస్.రాధ, డాక్టర్ కర్ర విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'టీడీపీలోకి తీసుకోవాలి'

రౌతులపూడి, మార్చి 26: టీడీపీ జడ్పీటీసీగా పోటీచేసిన గంటా గోపి, మాజీ ఎంపీటీసీ భర్త అల్లు బుజ్జిని టీడీపీ విజయం కోసం పార్టీలోకి తీసుకోవాలని ప్రత్తిపాడు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభను బీజేపీ, బీసీ నేత కోళ్ల రవిబాబు కోరారు. సోమవారం రాత్రి పది గంటలకు రవిబాబు నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ టీడీపీకి పనిచేసిన ఇద్దరు నేతలను స్థానిక నేతలు స్వార్థ ప్రయోజనాల వల్ల దూరంగా ఉంచుతున్నారని, ఇద్దరి పార్టీలోకి తీసుకుంటే పార్టీ విజయానికి కృషి చేస్తారన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు నేడు జిల్లా జట్ల ఎంపిక

కాకినాడ అర్బన్, మార్చి 26: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మోడరన్ పెంటతలాన్, పవర్ లిఫ్టింగ్ అండర్ 17 విభాగాల్లో రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్ల ఎంపిక బుధవారం డీఎస్‌ఏ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్టు కార్యదర్శి బీవీవీఎస్ ప్రసాద్ తెలిపారు. అర్హులైన క్రీడాకారులు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలన్నారు పెంటతలాన్‌కు ఎంపికైనవారు ఈనెల 30,31న తిరుపతిలో రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని, పవర్ లిఫ్టింగ్‌కు ఎంపికైనవారు విజయవాడ పోటీల్లో పాల్గొంటారన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

» ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప
» వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు



పెద్దాపురం: టీడీపీలో చేరినవారితో చినరాజప్ప



తునిరూరల్: టీడీపీలో చేరినవారితో యనమల

పెద్దాపురం, మార్చి 26: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పనిచేయాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప కోరారు. మండలంలోని జి.రాగంపేట గ్రామంలో పలువురు వైసీపీని వీడి చినరాజప్ప సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ రాజప్ప పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీతో కలిసి పనిచేసేవారికి ద్వారాలు తెరిచే ఉంటాయన్నారు. పార్టీలోకి కొత్తగా చేరినవారితో కలిసి ముందుకు సాగాలన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, కొత్తెం వెంకట శ్రీనివాసరావు (కోటి), బొడ్డు వెంకన్న, దేవళ్ల వర ప్రసాద్ (బోసు), జల్దాని సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కష్టపడేవారికి సముచితస్థానం

తుని రూరల్, మార్చి 26: కష్టపడి పని చేసే కార్యకర్తలు, నాయకులకు టీడీపీలో సముచిత స్థానం ఉంటుందని శాసన మండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంట యనమల స్వగృహంలో నియోజకవర్గానికి చెందిన వందలాది మంది కార్యకర్తలు, నాయకులు యనమలను కలిసి గ్రామస్థాయి పరిస్థితులను వివరించగా యనమల పలు సూచనలిచ్చారు. అనంతరం తొండంగి మండలం రావికంపాడు గ్రామానికి చెందిన పలు కుటుంబాలు వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరారు. యనమల వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీలోకి చేరినవారిలో కోదూరి లచ్చన్న దొర, సిద్ద చిట్టి వెంకయ్య, మేడిశెట్టి సత్తిబాబు, నాగం దివానం, వి.బుజ్జి, ఆమర్తి వీర్రాజు ఉన్నారు. నాయకులు యనమల లక్ష్మణరావు, మోతుకూరి వెంకటేష్, సుర్ల లోవరాజు, చింతమనీడి నాగ సోమ రాజు (అబ్బాయి), కొయ్యా రామకేశవ పాల్గొన్నారు.

కూటమిదే విజయం

ప్రత్తిపాడు, మార్చి 26: జరగబోవు సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీల కూటమిదే విజయమని ఆ కూటమి ప్రత్తిపాడు అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. మండలంలోని ధర్మవరంలో మంగళవారం టీడీపీ నేత బొల్లు కొండబాబు ఆధ్వర్యంలో 50 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. వారికి సత్యప్రభ పార్టీ కండువాలు వేసి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు దాట్ల అప్పన్నబాబు, పార్టీ మండలాధ్యక్షులు అమరాది వెంకట్రావు, జిల్లా వాణిజ్య విభాగ కమిటీ జిల్లా అధ్యక్షులు ఇందన ఏసు బాబు, పుణ్యమంతుల రాజా, రామిరెడ్డి ప్రసాద్, బొల్లు వెంకటేశ్వరరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం: పట్టణ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన 6వ వార్డులో పలువురు నడిపల్లి రాణి, కుంచె దొరబాబు, నడిపల్లి సురేష్, కుంచె రవీంద్ర, శ్యామిలీ, కొల్లి పైడియ్య, వీరబాబు, నాగన్న, రామకృష్ణ, చింతపల్లి రాజు సుమారు 110మందికి ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ, జనసేన ఇన్‌చార్జి తమ్మయ్యబాబు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎంపీపీ గొల్లపల్లి, మండలాధ్యక్షుడు సూతి బూరయ్య, కౌన్సిలర్లు బొది రెడ్డి గోపి, మూది నారాయణస్వామి, కోనాల వెంకట రమణ, మామిడి లలిత, వైబోగుల సుబ్బారావు, బుగతా శ్రీను, పెంటకోట మోహన్, జిగటాపు సూరి బాబు, బీజేపీ నాయకులు గట్టెం వెంకటరమణ, రెడ్డి లోవరాజు పాల్గొన్నారు. 6వ వార్డులో తిరిగి ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి సత్యప్రభ విజయానికి సహకరించాలని జనసేన ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు, బీజేపీ ఇన్‌చార్జ్ గంటా బాలు దొర కోరారు.



ఏలేశ్వరం: టీడీపీలో చేరినవారితో సత్యప్రభ

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని విధిగా పాటించాలి

స్పష్టం చేసిన రిటర్నింగ్ అధికారులు



సర్పవరం జంక్షన్:మాట్లాడుతున్న ఆర్డీవో కిషోర్

సర్పవరం జంక్షన్, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాజకీయ పార్టీలన్నీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని విధిగా పాటించి, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకారం అందించాలని కాకినాడ రూరల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో ఇట్ల కిషోర్ కోరారు. మంగళవారం సర్పవరం జంక్షన్‌లో మండల రెవెన్యూ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల ప్రచారం కోసం నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సమావేశాలు, వాహనాల కోసం ముందస్తుగా అనుమతులు తీసుకోవాలలన్నారు. సువిధ యాప్, నేరుగా రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందవచ్చన్నారు. రాజకీయపార్టీలు దరఖాస్తు చేసిన 48 గంటల్లో అనుమతులు మంజూరు జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో శాంతి భద్రతలకు విఘాతం వాటిల్లకుండా చేసుకోవాలని కాకినాడ ఎస్‌డీపీవో కె.హనుమంతరావు కోరారు. ఎంసీసీపై పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అనుమానాలు, సమస్యలపై రిటర్నింగ్ అధికారికి వివరించారు. సమావేశంలో జనసేన పార్టీ అభ్యర్థి పంతం నానాజీ, రావూరి వెంకటేశ్వరరావు (వైసీపీ), గదుల సాయిబాబా (టీడీపీ), కె.కృష్ణమూర్తి (ఆప్), విజయరామయ్య (బీఎస్పీ), విజయ రామయ్య (బీజేపీ), నాగేశ్వరరావు (సీపీఎం), టి రామ్మూర్తి (కాంగ్రెస్) తహశీల్దార్ బి.విజయప్రసాద్, డిటీ సురేష్, ఆర్ఐ మధు తదితరులు పాల్గొన్నారు.

ఎంసీసీ పక్కాగా అమలుచేయాలి

పెద్దాపురం, మార్చి 26: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ)ని పక్కాగా అమలుచేయాలని పెద్దాపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో జె.సీతారామారావు అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఎంసీసీ అమలు, పెండింగ్ క్లయిములు తదితర విషయాలపై పోలింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన డీఎస్పీ లతాకుమారితో కలసి మాట్లాడారు. నామినేషన్ దాఖలు నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకూ సంబంధిత బృందాలు, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల నియమావళి అమలుకు ఏర్పాటుచేసిన నిఘా బృందాలు సమర్థవంతంగా తమ బాధ్యతలను నిర్వర్తించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ర్యాలీలు, బహిరంగ సభలు, సమావేశాలు, రోడ్ షోల న్నింటినీ వీడియో సర్వేలెన్స్ టీం సభ్యులు రికార్డింగ్ చేసి వీడియో పరిశీలన సభ్యుల ద్వారా వివరాలను అకౌంటింగ్ టీం సభ్యులకు సమన్వయం చేసుకోవాలన్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు కానుకలు పంపిణీ చేయకుండా కట్టుదిట్టమైన చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. అలాగే రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎంసీసీ నియమావళిపై తెలియచేశారు. కార్యక్రమంలో పెద్దాపురం, సామర్లకోట తహశీల్దార్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, సీఐ రవికుమార్ పాల్గొన్నారు.

నియమావళి అతిక్రమిస్తే చర్యలు

ప్రత్తిపాడు, మార్చి 26: ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు కేసులు, చర్యలు తప్పవని, ప్రత్తిపాడు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావు, పెద్దాపురం డీఎస్పీ కె. లతాకుమారి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై రాజకీయ పార్టీప్రతినిధుల అవగాహన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు సభలు, సమావేశాలకు 48గంటలకు ముందుగా అనుమతులు పొందాలని తెలిపారు. కార్లు, ద్విచక్రవాహనాలు వంటి వాటికి కూడా అనుమతులు లేకుండా ప్రచారంలో వినియోగించే చర్యలు తీసుకుంటామన్నారు. స్థానిక తహశీల్దార్ నరసింహారావు, సీఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్ఐలు ఎం.పవన్‌కుమార్, సతీష్, కిషోర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు కొమ్ముల కన్నబాబు, కొండపల్లి శ్రీను, నీరుకొండ సత్యనారాయణ, సింగిలిదేవ్ సత్తిరాజు, దర్నాల కోట శ్రీను, ఎం. సూర్యప్రకాశరావు, దేవర వెంకటరమణ, మానుకొండ లచ్చబాబు, తహశీల్దార్లు, పోలీస్ అధికారులున్నారు.



పెద్దాపురంలో మాట్లాడుతున్న ఆర్డీవో



ప్రత్తిపాడులో మాట్లాడుతున్న ఆర్వో, డీఎస్పీ

వైసీపీ పాలనలో రక్షణ కరువు

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ



పిఠాపురంలో మాట్లాడుతున్న వర్మ

పిఠాపురం, మార్చి 26: వైసీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఆస్తులకు రక్షణ కరువైందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. పిఠాపురం టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రికార్డులను తారుమారు చేసి ఉన్న భూమిని లాక్కోవడంతో కడపకు చెందిన సుబ్బారావు అనే వ్యక్తి కుటుంబంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. ఇందుకు జగన్‌రెడ్డి ప్రభుత్వమే బాధ్యత వహించాలని స్పష్టంచేశారు. సుబ్బారావు కుటుంబంతో ఆత్మహత్య చేసుకోవడానికి కారకులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కబ్జాకు గురయిన భూమిని తిరిగి అప్పగించి మరణించిన వారందరికి రూ.50లక్షల వంతున ఎక్స్‌గ్రేషియా అందిం చాలన్నారు. సమావేశంలో నాయకులు బండారు రామారావు, పున్నం మునికేష్, మేలేటి గోపాలకృష్ణ, కొల్లి శ్రీను, నున్నా అబ్బులు, నక్కా శివాజీ, పడాల అమ్మన్న, కాకి రామకృష్ణ, బడిగండి రవి తదితరులు పాల్గొన్నారు.

విజయ పతాకాన్ని ఎగురవేద్దాం

పిఠాపురం రూరల్, మార్చి 26: అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి విజయపతాకాన్ని ఎగురవేద్దామని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ పిలుపునిచ్చారు. పిఠాపురం మండలం విరవలో మంగళవారం టీడీపీ-జనసేన ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. వర్మ మాట్లాడుతూ పిఠాపురం నుంచి పోటీ చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్, మాజీ ఎంపీపీలు కురుమళ్ల రాంబాబు, సకుమళ్ల నాగబాబు పాల్గొన్నారు. అంతకు ముం దు పిఠాపురం టీడీపీ కార్యాలయంలో గొల్లప్రోలు మండలం ఏకేమల్లవరం ఎస్సీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశానికి వర్మ హాజరై రాష్ట్రంలో దళితులకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు.

గొల్లప్రోలు: గొల్లప్రోలులో నిర్వహించిన టీడీపీ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వర్మ పాల్గొని పొత్తులో భాగంగా పోటీ చేస్తున్న జనసేన అభ్యర్థుల విజయానికి కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మాదేపల్లి వినీల్‌వర్మ, పడాల ఏసువెంకటరమణ, మడికి ప్రసాద్ పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించండి

పలుచోట్ల అభ్యర్థుల ప్రచారం



కాకినాడలో ప్రచారం నిర్వహిస్తున్న వనమాడి

కాకినాడ సిటీ, మార్చి 26: వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనలో ప్రజలకు, వారి ఆస్తులకు ప్రజలకు రక్షణ లేకుండా పోయిందని.. వైసీపీ అరాచక అవినీతి పాలన అంతానికి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించాలని సిటీ అభ్యర్థి వనమాడి కొండబాబు పిలుపునిచ్చారు. మంగళవారం 24వ డివిజన్‌లో సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ సైకిల్ గుర్తుకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, డివిజన్ నాయకులు పాలిక నాని, పెదపూడి కుమార్, మేడిశెట్టి చిన్ని, కండివిల్లి సుశీల, తడాల సత్యనారాయణ, పిడుగు రాజేష్, కంటిపూడి సీతామహలక్ష్మీ, చింతా పేర్రాజు, కడియాల వీరవెంకట సత్యనారాయణ, కంది కృప, పాలిక సూర్యశ్రీనివాస్ చౌదరి, పెదపూడి ప్రసాద్, సాకా ప్రవీణ్, హరి, మార్గదర్శి వెంకటేశ్వరరావు, బండి నరేంద్ర పాల్గొన్నారు.

గండేపల్లి మండలంలో...

గండేపల్లి, మార్చి 26: రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబును సీఎం చేసుకోవాలని జగ్గంపేట టీడీపీ,జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలో మల్లేపల్లి, బొర్రంపాలెం, ఎన్టీరాజాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. జనసేన గోకవరం మండలాధ్యక్షుడు ఉంగరాల మణిరత్నం, గండేపల్లి జనసేన అధ్యక్షుడు గోన శివ నెహ్రూకు మద్దతు తెలిపి ప్రచారానికి హాజరయ్యారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, దిడ్డి చినశ్రీను, పిల్లా సత్తిబాబు, కుంచే రాజా, తెలగరెడ్డి భద్రరావు, సుంకవిల్లి రాజు, వెంకన్నదొర, సుంకవిల్లి సత్యనారాయణ, యర్రంశెట్టి బాబ్జి, తెలగరెడ్డి ప్రకాశ్, తణుకు దుర్గారావు, బాలు, బత్తుల రమణ, దాపర్తి సీతారామయ్య ఉన్నారు.

జగ్గంపేటలో....

జగ్గంపేట, మార్చి 26: జగ్గంపేటలో జిల్లా పార్లమెంటరీ టీడీపీ ఇన్‌చార్జ్ జ్యోతుల నవీన్ తన తండ్రి జగ్గంపేట ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ గెలుపు కోసం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. గ్రామదేవత రావులమ్మ తల్లి ఆలయం నుంచి వేలాది మంది కార్యకర్తలతో పద్మనాభ నగర్‌చెట్టుపల్లిపేట, గోపాలనగర్, టవర్‌కాలనీతో పాటు జగ్గంపేటలో పలు ప్రాంతాల్లో ఇంటింటాప్రచారం నిర్వహించారు. నియోజకవర్గంలో పలువురు పెద్దలు, ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, రాంబాబు, సత్యసదాశివరెడ్డి, జోగారావు, జీను మణిబాబు, దేవరపల్లి మూర్తి, జీను రాంబాబు, కింగంరమణ, గంటా రమణ, దంట శివ, కొత్త కొండబాబు తదితరులున్నారు.

కిర్లంపూడి: వేలంకలో జగ్గంపేట ఉమ్మడి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ కుమార్తె తోట సునీత ఇంటింటా ప్రచారం నిర్వహించి సైకిల్ గుర్తుపై ఓటేసి నెహ్రూను గెలిపించాలని కోరా రు.

గోలివారి కొత్తూరులో...

సామర్లకోట, మార్చి 26: టీడీపీ కొత్తగా చేపట్టబోయే సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తామని పెద్దాపురం ఎమ్మెల్యే, టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలో గోలివారి కొత్తూరు గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు నిమ్మకాయల రంగనాగ్, తోటకూర శ్రీనివాస్, పాలకుర్తి శ్రీనుబాబు, తుమ్మల బాబు, విత్తనాల వెంకటరమణలతో కలిసి రాజప్ప ఇంటింటా పర్యటించి టీడీపీ కరపత్రాలను మహిళలకు అందజేశారు. ప్రచారంలో గోలి తమ్మిరాజు, గుమ్మళ్ళ రామకృష్ణ, కంచుమర్తి రాజన్న, కుర్రా నారాయణ స్వామి, జీ.సర్వేశ్వరరావు, అడ్డాల వెంకన్నబాబు, రాయవరపు కృష్ణారావు ఉన్నారు.

పలు గ్రామాల్లో...

తాళ్లరేవు, మార్చి 26: టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు గాడిమొగ పంచాయతీలో పెదవలసల మహాలక్ష్మతల్లికి పూజలు చేసిలో ప్రచారం నిర్వహించారు. పటవల, జి.వేమవరం, ఇంజరం గ్రామాల్లో టీడీపీ నేతలు సూపర్‌సిక్స్ పథకాలు వివరించారు. క్లస్టర్ ఇన్‌చార్జిలు మోపూరి వెంకటేశ్వరరావు, మందాల గంగసూర్యనారాయణ, నేతలు వాడ్రేవు వీరబాబు, పెసింగి ఈశ్వరరావు, పులపకూర అప్పారావు, సంగాడి కామేశ్వరరావు, బజన సత్తిబాబు, ఎమ్.సీతారామరాజు ఉన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

గ్రామాల్లో పోలీసుల కవాతు



216వ జాతీయ రహదారిపై పోలీసుల కవాతు

పిఠాపురం/పిఠాపురం రూరల్, మార్చి 26: ఎన్నికల సమయంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించాలని చూసినా, గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు హెచ్చరించారు. పిఠాపురం పట్టణం, మండలంలోని చిత్రాడ గ్రామాల్లో మంగళవారం ఉదయం, రాత్రి పోలీసుల కవాతు నిర్వహించారు. 216వ జాతీయరహదారి మీదుగా సీఐఎస్ఎఫ్ బలగాలతో కవాతు జరిపి ప్రజలకు అండగా ఉంటామని ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం స్థానికులతో సమావేశాలు నిర్వహించారు. సామరస్య వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ ప్రమోద్, సీఐలు శ్రీనివాస్, అంకబాబు, పట్టణ ఎస్ఐ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

'ఓటు హక్కు వినియోగించుకోండి'

తుని రూరల్, మార్చి 26: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కాకినాడ జిల్లా అడిషనల్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు అన్నారు. తేటగుంట గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఎన్నికల నియమావళి, నిబంధనలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ ఎస్‌వీఎస్ మూర్తి, రూరల్ ఎస్ఐ రమేష్‌బాబుతో పాటుగా గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రచార వాహనాల తనిఖీ



వైసీపీ ఎంపీ అభ్యర్థి సునీల్ ప్రచార వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

గొల్లప్రోలు రూరల్, మార్చి 26: మండల గ్రామాల్లో తిరుగుతున్న ప్రచార వాహనాలను ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు మంగళవారం తనిఖీ చేశారు. తాటిపర్తి-చెందుర్తి మధ్య తిరుగుతున్న కాకినాడ వైసీపీ ఎంపీ అభ్యర్థి చలమశెట్టి సునీల్‌కు చెందిన ప్రచార వాహనాన్ని ఆపి రికార్డులు, అనుమతులు పరిశీలించారు. అన్ని అనుమతులు ఉన్నట్టు ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి వెంకటేశ్వరరావు తెలిపారు.

ముగిసిన వెంకన్న కల్యాణోత్సవాలు

వైభవంగా శ్రీపుష్పయాగం



స్వామివారికి పుష్పయాగం నిర్వహిస్తున్న దృశ్యం

పిఠాపురం, మార్చి 26: తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో పిఠాపురంలో ఉన్న పద్మావతి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రితో ముగిశాయి. ఉదయం సుప్రభాతం, తోమాలసేవ, బాలభోగం, శుద్ధి తదితర కార్యక్రమాలు జరిగాయి. రాత్రి ద్వాదశారాధన పూర్వక శ్రీపుష్పయాగం నిర్వహించారు. పాల్గొన్న భక్తులకు దంపత తాంబూలాలు అందజేశారు. స్వామి, అమ్మవార్లను పుష్పాలతో విశేషంగా అలంకరించారు. ఆలయ వేదపండితులు రామకృష్ణాచార్యులు, నరసింహాచార్యులు పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. టీటీడీ డిప్యూటీ ఈవో వెంకటయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రాజగోపాలస్వామికి శ్రీ పుష్పయాగం

ప్రత్తిపాడు, మార్చి 26: మండలంలోని ధర్మవరంలో రుక్మిణి సత్యభామ స్వామి సమేత రాజగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. అలాగే స్వామి,అమ్మవార్లకు శ్రీపుష్పయాగం, పవళింపు సేవలను వైభవంగా జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు అంగర లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు సంప్రదాయబద్ధంగా ఈ కార్యక్రమాలు నిర్వహించగా గ్రామంలో మహిళా భక్తులు పూజలు నిర్వహించారు.

ముదునూరి ఎంపిక పట్ల హర్షం

రౌతులపూడి, మార్చి 26: టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ముదునూరి మురళీకృష్ణంరాజు ఎంపిక పట్ల రౌతులపూడి మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, ఎంపీపీ గంటిమళ్ల రాజ్యాలక్ష్మి, మాజీ ఎంపీపీ ఇంటశెట్టి భాస్కరబాబు, టీడీపీ యువ నేతలు గంటా గోపి, అల్లు బుజ్జీ, మాజీ సర్పంచ్ పైల సాంబశివరావు, కోసూరి కృష్ణవర్మ, జేట్లా రాజా, సింహాద్రి పెదబాబు, లాలం అప్పలనాయుడు, లెక్కలరాము, సోమరౌతు రవి, బంగారు స్వామినాయుడు, శీరంరెడ్డి లోవరాజు,లవుడు నాగేశ్వరరావు తదితరులు హర్షం వ్యక్తంచేశారు.

లేపాక్షిలో 29 వరకు ఎగ్జిబిషన్

కలెక్టరేట్ (కాకినాడ), మార్చి 26: స్థానిక నాగమల్లితోట జంక్షన్‌లో లేపాక్షి ఎంపోరియంలో ఈ నెల 29 వరకు థీమాటిక్ ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు సంస్థ మేనేజర్ వీరబాబు ఓ ప్రకటనలో తెలిపారు. తయారీదారులే నేరుగా తాము తయారు చేసిన వస్తువులను ఎగ్జిబిషన్‌లో విక్రయిస్తారన్నారు. ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, కలంకారీ శారీస్, రోజ్‌వుడ్ బొమ్మలు వంటివి లభిస్తాయని ఆయన తెలిపారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

ప్రత్తిపాడు, మార్చి 26: ప్రత్తిపాడు మండలం పెద్దశంకర్లపూడి గ్రామంలో మంగళవారం రాత్రి గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. గ్రామానికి మొల్లేటి చినరాము గడ్డిట్రాక్టర్ విద్యుత్‌వైర్లు తగిలి ప్రమాదానికి గురైంది. సంఘటనలో ట్రాక్టర్ వెనుక ఉన్న తొట్టి గడ్డి పూర్తిగా దగ్ధమవడంతో స్థానికులు జేసీబీని రప్పించి ట్రాక్టర్ తొట్టె నుంచి గడ్డిని వేరేచేసే చర్యలు చేపట్టారు. గడ్డితో పాటు ట్రాక్టర్ తొట్టి కూడా కాలిపోయింది.

నేడు ఉప్పలపాడులో విగ్రహ ప్రతిష్ఠ

గండేపల్లి, మార్చి 26: ఉప్పలపాడులో బుధవారం శ్రీలక్ష్మీ గణపతి సరస్వతుల విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని, 10వేల మంది భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశామని మాజీ సొసైటీ అధ్యక్షుడు మేడిబోయిన గోవిందరాజులు తెలిపారు.